# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని ముఖ్యమంత్రి నారా చందబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ నిత్యవసర సరకులను జూన్ 1 నుండి రేషన్ దుకాణాల వద్దనే పంపిణీ చేయనున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖ కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈరోజు అన్నమయ్య జిల్లాలో పర్యటించారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారిందని విశాఖలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=========================

పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని ముఖ్యమంత్రి నారా చందబాబు నాయుడు అన్నారు. కడపలో ఈరోజు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తోన్న మహానాడు సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సంపద సృష్టించడం ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామన్నారు. 'జూన్ పూర్తయ్యే 500 పౌర సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. రాయల సీమ ప్రాంతాన్ని రాష్ట్రానికి మణిహారంగా మారుస్తామన్నారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకువస్తామని, జూన్ 12లోగా కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=========================

అహల్య భాయ్ హోల్కర్ మహిళల కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప సంఘసంస్కర్త అని కేంద్ర ప్రసార సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ కొనియాడారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈరోజు జరిగిన అహల్య

భాయ్ హోల్కర్ జయంతి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... అహల్య భాయ్ హోల్కర్ చేసిన పనులను స్ఫూర్తిగా తీసుకొని కేంద్రప్రభుత్వం మహిళల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మహిళా సాధికారత కోసం గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, మరుగుదొడ్లు నిర్మించడం, డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేయడం, ఇంటింటికి కులాయి కనెక్షన్ ఇవ్వడం వంటి అనేక కార్యక్రమాలు కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. అంతకు ముందు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన ఈరోజు పాల్గొన్నారు.

========================

ప్రజల సౌలభ్యం కోసం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ డీలర్ల వద్దే నిత్యావసర సరకులు తెచ్చుకునే విధానాన్ని తీసుకొస్తున్నామని రాష్ట్ర పౌర సరపరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు విజయవాడలోని పలు రేషన్ దుకాణాల్లో మంత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఎప్పుడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు 1 నుండి 5వ తేదిలోగా రేషన్ డీలర్ వారి ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు అందిస్తారని చెప్పారు. రేషన్ దుకాణాలలో అవినీతి జరగకుండా ప్రభుత్వం సరికొత్త యాప్ ను రూపొందించిందని, ఈ యాప్ లో డీలర్ వివరాలు ఫోటోతో సహా వస్తాయని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 28 సెకన్లు)

========================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈనెల 31వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి ఢిల్లీ విమానాశ్రయం నుండి బయలుదేరి 12 గంటల 25 నిమిషాలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారని.. అక్కడ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి 12 గంటల 50 నిమిషాలకు సిహెచ్ గున్నేపల్లి చేరుకుంటారన్నారు. అక్కడి నుండి చెరువు పూడికతీత పనులను పరిశీలించి ప్రజలు, ప్రజాప్రతినిధులతో ముఖాముఖిగా చేపడతారన్నారు. అనంతరం పేదల సేవలో కార్యక్రమం పీ4లో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

========================

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకి సంబందించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి షబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబందించి రోజుకి 800కి పైగా వార్తా కథనాలను 15 భాషల్లో షబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. అయితే ఈ షబ్ద్ పోర్టల్ లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్ మొదలుకొని ఇప్పుడు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఎటువంటి కాపీ రైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

విరామం

========================

ఆరోగ్యానంద స్వర్ణాంధ్ర సాకారాన్ని యోగాంధ్ర కార్యక్రమం ముందుతీసుకెళ్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో విజయానంద్ పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. అనంతరం మాట్లాడుతూ... ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 25 వేల మంది యోగా శిక్షకులు నమోదు చేసుకున్నారని, వీరి సహాయంతో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు యోగాసనాలు నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. 26 జిల్లాల్లో 26 ఇతివృత్తంతో యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలోని సుమారు 100 పర్యాటక ప్రాంతాల్లో యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విజయానంద్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=========================

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, మారేడుమిల్లి మండల కేంద్రాలలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగించనున్నామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు. ఈరోజు ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 30వ తేదీ నుండి ఒక్కొక్క మండలానికి వేర్వేరు బృందాల ద్వారా అనధికారిక కట్టడాలను తొలగిస్తామన్నారు.

=========================

దేశ వ్యాప్తంగా ఈరోజు నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రలకు భారత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా 2 వేల మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా సంభాషించి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పంటలకి సంబంధించిన విలువైన సలహాలు, సూచనలు అందించనున్నారు. అందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని పట్టింపాలెంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని విద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ ఉత్పత్తుల్లో దేశవ్యాప్తంగా వాణిజ్యాన్ని సులభతరం చేయడంతో పాటు, ఆన్ లైన్ మార్కెట్ వేదికను ఏకీకృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంతో ఉద్యానవన పంటల సాగులో రైతుల సమస్యలు తెలుసుకోవడం, ఖర్చులు తగ్గించడం, మేలైన వంగడాలు ఎంపిక, అధిక దిగుబడులు సాధించడం, మార్కెటింగ్ విధానాలను వివరించడం వంటి సలహాలతో శాస్త్రవేత్తలు రైతులతో మమేకమవుతారని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారిందని విశాఖలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో తీరం వెంబడి గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

=========================
=========================